ఎండతో జనం విలవిల : రోడ్లు నిర్మానుష్యం

నిర్మానుష్యంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి - నరసాపురం

ఆదివారం ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. దీంతో బయటకు వెళ్లాలంటేనే ప్రయాణికులు బెంబే లెత్తిపోతున్నారు. మేనెల మాదిరిగా ఆగష్టు నెలలో ఎండలు బాగా పెరిగి 35 నుంచి 38 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. మధ్యాహ్నం వేసవి తాపానికి తాళలేని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఎండ తగ్గకపోవడంతో ప్రయాణికులు దూర ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. గ్రామాల్లో, పట్టణంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

ఇసుక కష్టం.. తీరేదెన్నడు..!

ఇసుక దొరక్క నిలిచిన నిర్మాణ పనులు

రెండు జిల్లాలో రెండు లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల అవస్థలు

కాగితాలకే పరిమితమైన స్టాక్‌పాయింట్లు

అలంకార ప్రాయంగా చేబ్రోలు స్టాక్‌పాయింట్

20 టన్నుల ఇసుక బ్లాక్‌లో రూ.26 వేలు

ఏ ప్రభుత్వం వచ్చినా మార్పు శూన్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వాలు మారినా ఇసుక కష్టాలు మాత్రం ప్రజలను వీడడం లేదు. ఉచిత ఇసుక అంటూ గొప్పలు చెబుతూ అసలు ఇసుకే అందకుండా చేసిన పరిస్థితి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో నెలకొంది. దీంతో ఇసుక కష్టాలు తీరేదెన్నడు అంటూ జనాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఇసుక కొరతతో నిర్మాణ పనులు నిలిచిపోవడంతో భవననిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయి. ఏలూరు జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. స్టాక్‌పాయింట్లలో ఇసుక లెక్కలు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రజలకు మాత్రం ఇసుక అందుబాటులో లేకుండాపోయింది. చేబ్రోలు ఇసుక పాయింట్ ఎందుకు ఉందో కూడా ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఈ స్టాక్ పాయింట్‌లో ఇసుక నిల్వలేకుండా అలంకారప్రాయంగా మాత్రమే మిగిలింది. కుక్కునూరు మండలం వింజరం, ఇబ్రహీంపేట ఇసుక పాయింట్ల వల్ల జనాలకు ఏమాత్రమూ ఉపయోగం లేకుండాపోయింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక స్టాక్‌పాయింట్లు సైతం లేకుండా పోయాయి. తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న స్టాక్‌పాయింట్ల వద్దకు వెళ్లినా ఇసుక దొరకడం లేదు. లారీలు కిలోమీటర్ల మేర బారులు తీరి ఉంటున్నాయి. రెండు, మూడు రోజులు వేచిచూసినా ఇసుక దొరకడం కష్టంగా మారింది. ఒకవేళ ఇసుక దొరికినా లారీ యజమానులు వెయిటింగ్ ఛార్జీలు వసూలుచేయడంతో తడిసి మోపెడవుతోంది. బ్లాక్ మార్కెట్లో 20 టన్నుల ఇసుక రూ.26 వేలు వసూలు చేస్తున్నారు. అదికూడా ఎప్పటికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఉచిత ఇసుక అంటే ఇదేనా అంటూ జనం నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక సమస్యపై అధికారులు చేస్తున్న ప్రకటనలకు వాస్తవ పరిస్థితికి సంబంధం లేకుండా పోయింది.

రెండు లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల అవస్థలు..

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 32 పనులకు సంబంధించి దాదాపు రెండు లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. ఇసుక కొరతతో నిర్మాణ పనులు ఆగిపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయి. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు కావడంతో పనుల్లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాపీ పనివారు, రంగులు వేసేవారు, సెంట్రింగ్, వడ్రంగి పనివారు ఇలా నిర్మాణ రంగంతో ముడిపడి ఉన్న అనేక మందికి పనులు లేకుండా పోయాయి. గత ప్రభుత్వంలో ఇసుక కొరత తీవ్రతతో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం మారినా అదే పరిస్థితి కొనసాగుతుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం వెంటనే ఇసుక అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. అధికారులు మాత్రం స్టాక్ పాయింట్లలో ఇసుక లెక్కలు చెబుతూ మభ్యపెట్టే పనులు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇసుక లేక నిర్మాణ పనులు ఆగిపోయాయి

గోకా సూరిబాబు, తాపీమేస్త్రీ, బువ్వనపల్లి

నా దగ్గర దాదాపు వంద మంది వరకూ పనిచేస్తారు. ఇసుక దొరక్క నిర్మాణ పనులు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పనుల్లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిన్నటి వరకూ వరద అన్నారు. వరద తగ్గాక కూడా ఇసుక దొరకడం లేదు. రెండున్నర యూనిట్ల ఇసుక బ్లాక్ రూ.12 వేలకు అమ్ముతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఇసుక సమస్య మాత్రం తీరడం లేదు. ఇసుక అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

పనిలేక కార్మికులు ఇంటి దగ్గర ఉంటున్నారు

చిన్న, తాపీ మేస్త్రీ, నిడమర్రు మండలం

నా వద్ద 25 మంది వరకూ పనిచేస్తారు. ఇసుక లేక పనులు ఆగిపోయాయి. నాలుగైదురోజులుగా పూర్తిగా పనులు ఆపేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 20 టన్నుల ఇసుక రూ.26 వేలు చెబుతున్నారు. స్టాక్‌పాయింట్ల వద్ద రోజుల తరబడి వేచిచూడాల్సి రావడంతో వెయిటింగ్ ఛార్జీలు వేయడంతో భారీగా ఖర్చవుతోంది. భవన యాజమానులు ఇసుక పేరు చెబితే హడలిపోతున్నారు. ఇసుక అందుబాటులోకి తీసుకు వస్తే పనులు ఉంటాయి. లేకపోతే పనిచేసే వారు తీవ్ర ఇ బ్బందులు పడాల్సివస్తోంది.

దుంపగడపలో దడదడ..!

రోజురోజుకీ పెరుగుతున్న జ్వర పీడితులు

అంతుచిక్కని రోగ లక్షణాలు

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని దుంపగడప గ్రామంలో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. అయితే జ్వర లక్షణాలు, దాంతోపాటు ఎదురవుతున్న ఇతర సమస్యలు జ్వర పీడితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. జ్వరమా లేక మరేదైనా రోగమా అనేది అర్థం కాక అక్కడి ప్రజలు అల్లాడిపోతున్నారు. వారం రోజులుగా ఇప్పటి వరకు కనీసం వంద మందికిపైగా జ్వరాల బారిన పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ జ్వర లక్షణాల్లో ప్రధానమైనది మచ్చలు రావడం. తొలుత జ్వరమొస్తోంది. రెండు, మూడు రోజులకు శరీరంపై మచ్చలు, ఆపై ఒళ్లు నొప్పులు మొదలవుతాయి. మరో రెండు రోజులకు కాళ్లు, చేతులు వాపులొస్తాయి. ఈ లక్షణాలు క్రమంగా పెరగడంతోపాటు జ్వర తీవ్రత కూడా పెరుగుతోంది. వైద్యులు సైతం ఏం చికిత్స అందించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. రక్త పరీక్షలు వగైరా చేస్తున్నప్పటికీ కారణం, చికిత్స ఏమిటనేది స్పష్టం కావడం లేదు. ఓపక్క సొమ్ము నీళ్లలా ఖర్చవుతున్నా రోగం తగ్గకపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. మాజీ ఎంపిటిసి పిన్నంరాజు శ్రీనివాసరాజు, విఆర్ఒ రాజా మంచం పై నుంచి లేవలేని పరిస్థితి.

భయపడొద్దు..మందులున్నాయి

ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు

ఎవరూ భయపడొద్దు. ఇది ఒక రకమైన జ్వరం మాత్రమే. ఫ్లూ జ్వరాల్లో ఇది ఒక రకం. మార్కెట్లో ఈ జ్వరానికి మందులున్నాయి. త్వరలోనే పూర్తిస్థాయిలో మందులు అందుతాయి. ఈ రకమైన మందులు ప్రస్తుతానికి ప్రభుత్వాసుపత్రుల్లో లేవు. త్వరలోనే రప్పించే ప్రయత్నం చేస్తాం.

సాగరతీరం.. ఆనందకరం

సముద్ర స్నానాలు చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరు పాలెంబీచ్ పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో, ఇసుక తెన్నెలపై చిన్నారులు ఆటలాడుకున్నారు. అనంతరం ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసన

వీరవాసరంలో నిరసన

ప్రజాశక్తి - గణపవరం

కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా ఆదివారం గణపవరం, నిడమర్రు మండలాల పిఎంపి అసోసియేషన్ మినాక్షి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గణపవరంలో డాక్టర్లు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆసుత్రి డాక్టర్లు ఉప్పలపాటి జనార్ధన్, పిఎంపి అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు ప్రాణదానం చేస్తున్న వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమైన విషయమని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వి.శివ శ్రీనివాసరావు, నిడమర్రు మండల అధ్యక్షులు మూర్తి, కార్యదర్శి శంకు శీను, ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రావు, కోశాధికారి కొటకల అప్పారావు పాల్గొన్నారు.

వీరవాసరం :కోల్‌కత్తాలో మెడికల్ విద్యార్థినిపై హత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని సిఐటియు ఆధ్వర్యంలో వీరవాసరంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలోనే మహిళలకు రక్షణ ప్రశ్నార్థకంగా మారడం బాధాకరమైన విషయం అన్నారు. కంచే చేను మేసిన చందాన అక్కడి ప్రభుత్వం వ్యవహరించడం దారుణమని తెలిపారు. దేశమంతటా ఒక్కటై ఆందోళన చేస్తున్నా కేంద్ర పాలకులు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో అన్ని అధికారాలూ చేతిలో ఉన్న ముఖ్యమంత్రి న్యాయం కావాలని ధర్నా చేస్తే ఇక న్యాయం చేసేది ఎవరన్నారు. కపట నాటకాలతో ప్రజలను వంచించడం మానుకోవాలన్నారు. విచారణ కట్టుదిట్టం చేసి దోషులను కఠినంగా శిక్షించడం ద్వారానే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపవరంలో నిరసన

వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ఆకివీడు :వక్ఫ్ బిల్లుని తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ 'ఆవాజ్' రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వక్ఫ్ బిల్లులో చేసిన సవరణలపై రాష్ట్రవ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు జరపాలని పిలుపునిచ్చాయి. ఈమేరకు స్థానిక షాదీఖాన కమ్యూనిటీ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. షేక్ వలి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ పాల్గొని మాట్లాడారు. ఈ వక్ఫ్ బిల్లు భారతదేశ మౌలిక స్వభావంగా వున్న భిన్నత్వంలో ఏకత్వంను దెబ్బతీసే విధంగా వుందని అన్నారు. రాష్ట్ర జాబితాకి సంబంధించిన భూములను కేంద్రప్రభుత్వం అజమాయిషీ చేయడాన్ని ఫెడరల్ వ్యవస్థపై జరిగే దాడిగా పరిగణించాలని అన్నారు. వక్ఫ్ బిల్లు సవరణ ముస్లింల పట్ల దురుద్దేశంతో చేసినవి తప్ప ప్రేమతో కాదన్నారు. త్వరలో హర్యానా, మహారాష్ట్రలో జరగనున్న ఎన్నికల్లో కేవలం బిజెపి రాజకీయ ప్రయోజనం కోసం ముస్లింల ఉనికిని ఫణంగా పెట్టి, ఓట్లు దండుకోవాలనే దుష్ట ఆలోచనతో ఈ బిల్లు తెచ్చారని విమర్శించారు. స్వతంత్రం వచ్చిన ఇన్ని సంవత్సరాల్లో లేని సమస్య ఇప్పుడే ఎందుకు వచ్చిందని, హుటాహుటిన బిల్లుని సవరణ చేయవలసిన అవసరం ఏంటని ప్రశ్నించారు. వక్ఫ్ బోర్డులో ముస్లింయేతరులను పెట్టడం మత స్వేచ్ఛపై వేటుగా భావించాలని అన్నారు. తక్షణం అందరం సమైఖ్యంగా పోరాడాలన్నారు. ఎండి మస్తాన్ వలి మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుకి వున్న అధికారాలను తొలగించి స్థానిక జిల్లా కలెక్టర్‌కి అధికారం ఇవ్వడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని అన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఆకివీడులో వున్న ముస్లిం సోదర సోదరీమణులందరు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు, సిపిఎం నాయకులు సందక సూరిబాబు, టీచర్ షాజన్, జక్కి, ఎండి అజ్మల్, ఎండి అహ్మద్, డివైఎఫ్ఐ నాయకులు గేదెల ధనుష్, బొక్క వర్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కనుమూరు రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ప్రభుత్వ నిధులు, ప్రజల భాగస్వామ్యంతో నేతలందరినీ సమన్వయపరచుకుని ఉండి నియోజకవర్గం సమగ్రాభివృద్ధి కోసం రాబోయే ఐదేళ్లు శక్తి వంచనలేకుండా కషిచేస్తానని కనుమూరు రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు నియోజకవర్గ అభివృద్ధి, తదితర అంశాల గురించి ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న : గడిచిన ఐదేళ్లు నరసాపురం ఎంపీగా పనిచేశారు. ఇప్పుడు ఎంఎల్ఏగా ఎన్నికయ్యారు. మీరు గుర్తించిన ప్రధానమైన సమస్యలు ఏమిటి?

జవాబు : ఉండి నియోజకవర్గం ప్రధానంగా వ్యవసాయాధారిత ప్రాంతం. ఎక్కువ భాగం వరి, ఆక్వా పంటలు సాగయ్యే ప్రాంతం కూడా ఇదే. రైతులకు సంబంధించి అనేక సమస్యలున్నాయి. ప్రధానంగా తాగు, సాగునీటికి సంబంధించి నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. నీటిని సక్రమంగా అందించే పరిస్థితుల్లేకుండా ఉన్నాయి. ప్రధాన పంట, మురుగు కాలువలు ఎక్కువగా తన నియోజకవర్గం పరిధిలోనే ఉంది. నీటిని విడుదల చేసే లాకులు, షట్టర్లు దెబ్బతిన్నాయి. వాటి గేట్లు కూడా మరమ్మతులకు నోచుకోకుండా ఉన్నాయి. దశల వారిగా అభివృద్ధి పనులు చేస్తా.

ప్రశ్న : గత ప్రభుత్వం సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేసింది? మీ అభిప్రాయం?

జవాబు : తుంగభద్ర డ్యామ్ మెయింటనెన్స్ 37 శాతం ఆంధ్రప్రదేశ్ భరించాల్సిందే. గత వైసిపి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఆ సమయంలో కర్ణాటక ప్రభుత్వం ఎన్నికల్లో ఉండటంతో నిర్లక్ష్యం చేసింది. గత వైసిపి ప్రభుత్వం పాలకుల నిర్లక్ష్యానికి ప్రజలు, రైతులు లక్షలాది ఎకరాల్లో నష్టపోయారు. తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంపై కర్నాటక, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాలు కదిలాయి. నీరుపోయినా ఒక పంటకు ఇబ్బంది ఉండదు. రెండో పంట గురించి ఇప్పుడే చెప్పలేం. గేటు ఏర్పాటు తరువాత వర్షాలొస్తే సానుకూలంగా ఉంటుంది. డ్యామ్ నిర్మాణం జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు 70 ఏళ్ల చరిత్రలో ఎప్పుడూ ఇటువంటి ఘటన చోటు చేసుకోలేదు. ఇంజినీరింగ్ నిపుణులు నీళ్లు ఉండగానే గేట్లు అమర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పోలవరం గేట్లు అమరుస్తున్న ఇంజినీరు కన్నయ్య నాయుడు కూడా ఇక్కడే ఉన్నారు. ఆయన నేతృత్వంలో ఈ పనులు నడుస్తున్నాయి. 1625 అడుగుల వద్దనే గేట్లు అమర్చే ప్రయత్నం జరుగుతోంది. మొత్తం రాతి కట్టడం కాబట్టి స్టాప్‌లాగ్ ఏర్పాటు కష్టతరమైనదే. అయితే నేరుగా గేట్లు ఏర్పాటు జరుగుతోంది.

ప్రశ్న : ఎంఎల్ఏ అయ్యాక మీరు నియోజకవర్గంలో ముందు చూపుతో పంట, మురుగు కాలువలను అభివృద్ధి చేస్తున్నారు?

జవాబు : పంట, మురుగు కాలువలను అభివృద్ధి చేయాలనే తలంపుతో పనులు చేస్తున్నప్పుడు 15 రోజుల తరువాత రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి రాష్ట్రవ్యాప్తంగా పంట, మురుగు కాలువలను అభివృద్ధి చేయాలని ప్రకటించారు. డ్రెయినేజీ మెయింటినెన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కార్యక్రమం ద్వారా నిధులు సేకరణ జరిగింది. పంటకాలువల అభివృద్ధి పనులు 90 శాతం వరకు పూర్తి అయ్యాయి. మేజర్ డ్రెయిన్‌లో కిక్కిస ఎక్కువగా ఉంది. ప్రభుత్వ జిఒలో కిక్కిస తొలగింపునకు అనుమతి లేదు. కిక్కిస తొలగింపు విషయంలో ప్రభుత్వ జిఒలో కొన్ని సవరణలు చేయాలని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకు వెళ్లాను.

ప్రశ్న : ఉప్పుటేరు ప్రక్షాళనపై ప్రతిపాదనలు చేస్తున్నారా?

జవాబు : ఉప్పుటేరులో కోటిన్నర అభివృద్ధి పనులతో కిక్కిసను తొలగించాలి. శాశ్వతంగా రెండు పంటలకు నీటి సంఘాలకు కిక్కిస తొలగింపు పనులు అప్పగించనున్నాం. డ్రెయినేజీ మెయింటినెన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నుంచి రూ.50 లక్షల లోపు జరిగే పనులు శాశ్వతంగా నీటి సంఘాలకు అప్పగించి చేయిస్తామన్నారు. రెండు పంటలను కొనుగోలు చేసే నీటి సంఘాలకు అప్పగిస్తాం. ఎప్పటికప్పుడు గుర్రపు డెక్క, తూడు, కిక్కిస తొలగింపు పనులు చేసుకోవడానికి వీలు ఉంటుందన్నారు. రెగ్యులేటర్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి. అత్యవసర పనులు ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి అభివృద్ధి పనులు చేపడతాం.

ప్రశ్న : ప్రధానంగా ఏ సమస్యలపై దృష్టి సారించారు?

జవాబు : ఉండి నియోజకవర్గంలో ఉన్న గ్రామాల్లో తాగు, సాగునీరు అందించేందుకు కృషిచేస్తా. రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం, పోలవరం జాతీయ ప్రాజెక్టు పూర్తిచేసేందుకు చంద్రబాబు ఎంతగానో శ్రమించారని గుర్తుచేశారు. జగన్ రాక్షస పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, దీంతో చంద్రబాబు వస్తేనే అభివృద్ధి సాధ్యమని భావించి టిడిపికి పట్టం కట్టారు.

ప్రశ్న : మీరు గుర్తించిన ఇతర ప్రధానమైన సమస్యలేమున్నాయి?

జవాబు : బాలిక విద్యపై దృష్టి సారించాలని నేను భావిస్తున్నాను. బాలికలు ప్రాథమిక విద్య దశలోనే డ్రాప్ అవుట్స్ అవుతున్నారు. అదేవిధంగా బాల్య వివాహాలు జరుగుతున్నాయి. వీటిని నిరోధించేందుకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టడంతో బాలిక విద్యను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలని భావిస్తున్నా. ఇవి కాకుండా తాగునీటి సమస్య, రహదారుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

ప్రశ్న : పర్యటక కేంద్రాల అభివృద్ధి?

జవాబు : ఆకివీడులో కాటన్ పార్క్ ఉంది. ఆ పార్క్‌ను పరిశీలించి అభివృద్ధి చేస్తా. ఏలూరుపాడులో తాత-మనవడు దీవి ఉంది. త్వరలో ఆ దీవిని పరిశీలిస్తా.

ప్రశ్న : టిడిపి పాలనలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నారా?

జవాబు : టిడిని పాలనలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నాం. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో రాణించాలి, అప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకోగలుగుతారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆణిముత్యాలు లాంటి క్రీడాకారులు ఒలంపిక్ స్థాయికి ఎదగాలి. వాలీబాల్ క్రీడలను క్రీడాకారులకు వసతుల కల్పనకు తన వంతు కృషిచేస్తాను.

ప్రశ్న : గంజాయి నివారణకు చర్యలు?

జవాబు : ఉండి నియోజకవర్గంలో గంజాయి నివారణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే గంజాయి అమ్ముతున్న బడ్డీ కొట్టులు గుర్తించి వాటిని తొలగించడం జరిగింది. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. డ్రగ్స్‌కు బానిసలైన అనేక మంది యువత తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. తమ పిల్లలు కదలికలు, వారి అలవాట్లను తల్లిదండ్రులు గమనించాలి.

ప్రశ్న : నియోజకవర్గంలో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారా?

జవాబు : ఈ ప్రాంతం పరిశ్రమలకు అనువు కాదు. ఇక్కడ వ్యవసాయ, ఆక్వా ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తా

ప్రశ్న : ఎంఎల్ఏ అయ్యాక మీరు రైతుల సమస్యలపై దృష్టిసారించి పనులు చేస్తున్నారు?

జవాబు : అభివృద్ధిపథంలో నడిపించేందుకు సాయశక్తుల కృషిచేస్తాను. ఎందుకంటే ఈ నియోజకవర్గం నా సొంత నియోజకవర్గం. నాకు ఈ ప్రాంతం పట్ల ప్రత్యేకమైన అభిమానముంది.

ప్రశ్న : ఉండి నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఉన్నారు?

జవాబు : ప్రధానంగా మంచినీళ్లు అన్ని గ్రామాలకు అందించాలనే లక్ష్యంతో పాటు డ్రెయినేజి వ్యవస్థ అభివృద్ధి చేయడం, పాఠశాలల ఆవరణల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తా. పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేస్తున్నాం. నియోజకవర్గంలో 10 పాఠశాలలకు క్రికెట్ నెట్ ప్రాక్టీస్ కిట్‌లు, వాలీబాల్ కిట్లు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అందిస్తా.

ప్రశ్న : ఉండి నియోజకవర్గంలో మంచినీటి చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు చేస్తున్నారా?

జవాబు : వేసవిలో 10-15 గ్రామాల్లో మంచినీటి చెరువులను అభివృద్ధి చేస్తా. చెరువు తవ్వకం విధానంలో కొన్ని మార్పులు చేయాల్సి ఉంది. చెరువు మట్టి తవ్వితే 20 శాతం గట్లు ఏర్పాటుకు వినియోగించవచ్చు. మిగతా 80 శాతం మట్టిని ఇతరులకు ఇచ్చి చెరువు అభివృద్ధి చేసేలా చేస్తా.

ప్రశ్న : ఉండి నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల వివరాలు వివరించగలరు?

జవాబు : అభివృద్ధి దశలో ఉన్న ఉండి హైస్కూల్‌ను సెప్టెంబర్ ఐదున గురుపూజోత్సవం నాటికి పూర్తి చేస్తాం.

ప్రజల రుణం తీర్చుకుంటా : మంత్రి నిమ్మల

యలమంచిలి: పాలకొల్లు నియోజకవర్గ ప్రజలు తనను మూడుసార్లు ఎంఎల్ఏగా ఆశీర్వదించారని, వారి రుణం తీర్చుకునేందుకు ఎల్లవేళలా చిత్త శుద్ధితో పనిచేస్తానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం యలమంచిలి మండలం కాంబోట్ల పాలెం గ్రామంలో రూ.14.60 లక్షలతో సీసీ అంతర్గత రహదారుల నిర్మాణమునకు శంకుస్థాపన చేయడంతోపాటు అదే గ్రామానికి చెందిన వరద బాధితులు 205 కుటుంబాలకు, గుంపర్రు గ్రామంలో 170 కుటుంబాలకు 25 కేజీలు చొప్పున బియ్యం, నిత్యవసర సరుకులను మంత్రి రామానాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ అయిదేళ్ల పాలనలో రాష్ట్రంలో రూ.14 లక్షల కోట్లు అప్పులు తెచ్చి, పక్కదారి మళ్లించి, ఖజానా ఖాళీ చేసి, ప్రతి వ్యక్తి మీద రూ.2.50 లక్షలు అప్పు నెత్తిమీద పెట్టారన్నారు. టిడిపి, బిజెపి, జనసేన ప్రజా ప్రభుత్వానికి ప్రజలు అవకాశం ఇచ్చారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛను ఒకేసారి పెంచి, మూడు నెలలు ఏరియర్సు కలిపి రూ.7 వేలు ఇంటికి వచ్చి అందజేసామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఇంటికి వచ్చి పెన్షన్ అందజేశారని, దేశంలో ఒక ముఖ్యమంత్రి ఇంటికి వచ్చి పింఛను అందించిన రికార్డు మన ఆంధ్రప్రదేశ్‌కు దక్కిందని మంత్రి అన్నారు. జగన్ ఐదేళ్లలో ఒక్క డిఎస్‌సి గాని, మెగా డిఎస్‌సి లేదని, ఒక్క టీచరు పోస్టు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి సంతకం డిఎస్‌సి 16,500 పోస్టులకు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని మంత్రి తెలిపారు. సమస్య వచ్చినా పరిష్కరించి, అందరిని కలుపుకుని కలిసి పనిచేసే మన ప్రజా ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి పంచాయతీ రాజ్ ఇఇ ఎస్.శ్రీనివాస రావు, ఇన్‌ఛార్జి తహశీల్దారు బాజీ సత్యనారాయణ, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, డిఇలు కె.దుర్గాస్వామి నాయుడు పాల్గొన్నారు.

ప్రాతళ్లమెరక గ్రామస్తులతో సమావేశమైన లక్ష్మీనారాయణ

గ్రామాభివృద్ధి అమోఘం : లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - కాళ్ల

ప్రాతళ్లమెరక గ్రామాభివృద్ధి అమోఘమని సిబిఐ మాజీ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రాతళ్లమెరక గ్రామంలో లక్ష్మీనారాయణ ఆదివారం పర్యటించారు. గ్రామంలోని తాగునీటి చెరువును కెవికె విద్యానికేతన్ పాఠశాలను, వృద్ధాశ్రమం, ప్రభుత్వపాఠశాల, పలు ప్రార్థనా మందిరాలు, గ్రామ సచివాలయాన్ని, హెల్త్‌క్లినిక్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాతళ్లమెరక గ్రామానికి పదేళ్ల క్రితం వచ్చానని, ఈ పదేళ్లలో ప్రాతళ్లమెరక ఎంతో అభివృద్ధి సాధించిందని తెలిపారు. గ్రామం చూడచక్కగా ఉందని, సిమెంట్ రోడ్లు, అందరికీ ఇళ్లు, మౌలిక సదుపాయాలు ఏర్పడ్డాయన్నారు. గ్రామాలకు ఆదర్శంగా ప్రాతళ్లమెరక గ్రామాన్ని వేగిరాజు శివవర్మ తీర్చిదిద్దారన్నారు. శివవర్మ చేస్తున్న కృషికి పద్మశ్రీ అవార్డు రావాలని ఆకాంక్షించారు. ప్రతి గ్రామమూ ఆదర్శ గ్రామంగా ఉండాలని, తాను కోరుకుంటూ ముంబై యూనివర్సిటీలో పిహెచ్‌డి చేస్తున్నానని తెలిపారు. ఈ నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్రతో పాటు అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో ఎంపికైన ఆదర్శ గ్రామాల్లో కొన్నింటిని సందర్శించి అక్కడ పరిస్థితులను తెలుసుకుని వాటిపై నివేదికను తయారుచేసి ముంబై యూనివర్సిటీకి, ప్రభుత్వాలకు పంపుతానని తెలిపారు. కాళ్ల మండలంలోని ప్రాతళ్లమెరక, భీమవరం మండలంలోని వెంప, చినఅమిరం, కృష్ణా జిల్లాలో తాడినాడ గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజల ద్వారా వివరాలు సేకరించి నివేదిక తయారు చేస్తానని వివరించారు. ఆయన వెంట వేగిరాజు శివవర్మ, కంతేటి శ్రీనివాసరాజు, కంతేటి సుబ్బారాజు పాల్గొన్నారు.

పేదలకు సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి - తణుకు

డబ్బులేక వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి తణుకు నియోజకవర్గంలోని వేల్పూరు గ్రామానికి చెందిన బోడపాటి నాగసునీత రూ.1,47,725లు, అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామానికి చెందిన అల్లం దేవినాగవేణికి రూ.లక్ష ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సిఫార్సు మేరకు అందించినట్లు తెలిపారు. ముందుగా అనుమతి తీసుకొని వైద్యం చేయించుకొనుటకు ఆసుపత్రికి మంజూరు కాబడిన ఉత్తర్వులను ఎల్‌ఒసి(లెటర్ ఆఫ్ క్రెడిట్) లబ్ధిదారులకు తణుకు క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎంఎల్‌ఎ వారి కుటుంబాలకు సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారికి జరగాల్సిన వైద్యం కోసం చూస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వారి కుటుంబానికి చేయూతగా నిలవడంతో వారు తమ ఆనందాన్ని వ్యక్తపరిచి కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థులతో మానవత శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవతా స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా స్థానిక మానవతా శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ మార్టేరులో శాంతి ర్యాలీ నిర్వహించారు. అణు ఆయుధాల నిషేధం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకంపై నియంత్రణ, జలసంరక్షణ, విద్యావ్యాప్తి తదితర అంశాలపై నినాదాలు ఇస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి, కోశాధికారి చదువుల వెంకట నరేంద్ర మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకుల ఆశయాలకు అనుగుణంగా ఈ శాంతి ర్యాలీని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ర్యాలీ అనంతరం విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు కొత్త సత్యనారాయణమూర్తి, రీజనల్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు, ఛైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, అడ్వైజరీ బోర్డు సభ్యులు చిర్ల సూర్యనారాయణ రెడ్డి, యోగా మాస్టర్ వడలా రామచంద్రారెడ్డి, ఇసి ఎమ్మెల్సీ చిర్ల వంశీ కృష్ణారెడ్డి, ఇసి మెంబర్స్ అమృతవాకుల సత్యనారాయణ, అంబులెన్స్ డ్రైవర్ గుబ్బల శ్రీనివాస్ పాల్గొన్నారు.



హెచ్‌ఎంకు విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల విరాళం అభినందనీయం

హెచ్‌ఎం రవిశంకర్

ప్రజాశక్తి - మొగల్తూరు

తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి విరాళం అందజేయడం అభినందనీయమని పేరుపాలెం ప్రధానోపాధ్యాయులు వర్ధనపు రవిశంకర్ సర్కార్ అన్నారు. మొగల్తూరులోని పేరుపాలెం రంగరాయ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1982-83 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.69 వేల నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో అనంతపల్లి బద్రీనాథ్, పులపర్తి జెఎస్.శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జేశ్వరరావు, వెలిగట్ల త్రినాథ్, కడలి తాతయ్య, అందే సత్యనారాయణ, బొడ్డు రంగనాయకమ్మ, పొన్నపల్లి శ్రీను, కాంచనలత ఉన్నారు.

నాణ్యమైన వైద్యం అందించడం అభినందనీయం

ఎంఎల్‌ఎ నాయకర్

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉచిత వైద్యశిబిరం ద్వారా ప్రజలకు మంచి వైద్యం అందించడం అభినందనీయమని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మెగాస్టార్ పద్మవిభూషణ్ చిరంజీవి దత్తత తీసుకున్న పేరుపాలెం సౌత్ గ్రామంలో చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా మాజీ సర్పంచి మేళం బన్ను ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని నాయకర్ ప్రారంభించి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేయాలని ఆయన అభిమానులకు సూచించారు. ఈ శిబిరంలో వైద్యులు లింగం నరసింహారావు, దేవికృష్ణ మాదంశెట్టి కోటేశ్వరరావు, పద్మావతి దంపతులు ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఆయా కార్యక్రమాలలో వైద్యులు కొల్లేపర గోపాల్, బల్ల మురళీ, చిన్నమిల్లి సత్యనారాయణ, అందే సతీష్, స్థానికులు సత్తినేని బాబ్జి పాల్గొన్నారు.

పాలకొల్లు : ఈనెల 22న మెగాస్టార్ చిరంజీవి 69వ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే వారోత్సవాలలో భాగంగా పెదమామిడిపల్లి మెగా పవర్ ఫ్యాన్స్ చేబ్రోలు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ, నాటే కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిరంజీవి రాష్ట్ర యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు, పాలకొల్లు పట్టణ జనసేన అధ్యక్షులు శిడగం సురేంద్ర హాజరయ్యారు. పెదమామిడిపల్లి రామాలయం వీధి, హైస్కూల్ ప్రాంతం, దిగమర్రు గ్రామాలలో 100 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పరిం వెంకట నవీన్, గుణ్ణం మణికంఠ, దాసిరెడ్డి పుష్పరావు, రాపాక నందియ్య, కాలేపు చిట్టీ కాసులు పాల్గొన్నారు.

సాంప్రదాయాలను కాపాడుకోవాలి

మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభించిన ఎంఎల్‌ఎ అంజిబాబు

భీమవరం టౌన్: ప్రతిఒక్కరూ మన సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం పట్టణంలోని 26వ వార్డు సుంకర పద్దయ్య వీధిలో జాతర కమిటీ ఆధ్వర్యంలో 50వ శ్రీమావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని, 14వ వార్డు చిన్నివారి వీధిలో మావుళ్లమ్మ శ్రీరామ బాలభక్త మణికంఠ యువజన సంఘం ఆధ్వర్యంలో 52వ శ్రీమావుళ్లమ్మ జాతర మహోత్సవాలను ఎంఎల్‌ఎ అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 50 ఏళ్లుగా ఎంతో భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా అమ్మవారి జాతరను నిర్వహించడం అభినందనీయమని, అమ్మవారి ఆశీస్సులు మనందరికీ ఉంటాయని అన్నారు. సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు ప్రతిఒక్కరూ భక్తి భావంతో ఉండాలని, వాడవాడలా అమ్మవారి జాతరలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నా నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్ధసారధి, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా పాపన్న గౌడ్ జయంతి

పాలకోడేరు : పాలకోడేరు గ్రామం పురాణాదిమ్మ వద్ద గౌడ్ సెంటర్‌లో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలు గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గౌడ సంఘ అధ్యక్షులు కారింకి సాయిబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జువ్వలపాలెం గ్రామ మాజీ సర్పంచి, బిసి నాయకులు కొండేటి శివకుమార్ గౌడ్ పాల్గొని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల లేసి ఘన నివాళులర్పించి మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా గౌడ యువత, గౌడ సంఘాలు పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘ గౌరవ అధ్యక్షులు అంగర సుబ్బారావు, యిర్రింకి శ్రీనివాసు, తొంటా సాయిబాబు ఉన్నారు. అనంతరం సంఘానికి విశిష్ట సేవలందించిన పెద్దలను గౌడ సంఘ యువకులు సాలువతో సత్కరించి అభినందించారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో పాలకవర్గసభ్యులు, ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అధికారుల నిర్లక్ష్యం.. వినియోగదారులకు శాపం!

మార్టేరు పరిధిలో విద్యుత్ వినియోగదారుల అగచాట్లు

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యుత్‌శాఖ అధికారుల మధ్య సమాచార లోపం, స్థానిక ఉద్యోగుల నిర్లక్ష్యం వీటి కారణంగా శనివారం మార్టేరు విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పలు గ్రామాలలో విద్యుత్ వినియోగదారులు అనేక ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు కరెంటు లేక, ఎప్పుడొస్తుందో తెలీక చీకటి, ఉక్కపోత, దోమలతో అంతా నరకయాతన పడ్డారు. మండలంలోని మార్టేరు 33కెవి సబ్‌స్టేషన్ పరిధిలో సత్యవరం, వెలగలేరు, మార్టేరు, నెగ్గుపూడి, వనంపల్లి గ్రామానికి చెందిన సుమారు 7వేల విద్యుత్ కలెక్షన్లు ఉన్నాయి. అయితే ఈ సబ్‌స్టేషన్ పరిధిలో కొద్దిపాటి మరమ్మతులకు, ట్రీ కటింగ్ చేసేందుకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆ ఉద్యోగులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మరమ్మతు పనులు పూర్తయిన అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సబ్ స్టేషన్‌లో ఒక్కసారిగా ఓవర్ లోడ్ ఉత్పన్నం కావడంతో సబ్ స్టేషన్‌లోని బాకర్ ఉన్నట్టుండి పేలిపోవడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

భాకర్ మరమ్మతు చేసిన అనంతరం సాయంత్రం ఏడు గంటలకు కొన్ని ప్రాంతాలకు మాత్రమే విద్యుత్ పునరుద్ధరణ జరిగింది. దీంతో మిగిలిన కొన్ని ప్రాంతాల వాళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మార్టేరు పలు గ్రామాలకు ప్రధాన వ్యాపార కేంద్రం కావడంతో పాలు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, భోజనం హోటల్స్ వంటి వ్యాపారులతోపాటు, చిన్న పరిశ్రమల వారు, ఇంకా పనులు ముందుకు సాగక ఉపాధి కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే మార్టేరు విద్యుత్ సబ్ కేంద్రంలో తరుచుగా ఏర్పడే అవరోధాలు తొలగించి, స్థానిక గ్రామాలలో కరెంటు కష్టాలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

ఆదర్శనీయ కమ్యూనిస్టు నేత శ్రీరామ్మూర్తి

సిపిఎం ఆధ్వర్యంలో శ్రీరామ్మూర్తికి ఘన నివాళులు

ప్రజాశక్తి - భీమవరం

కమ్యూనిస్టు నేత వలవల శ్రీరామ్మూర్తి అందరికీ ఆదర్శనీయులని, ఆయన అడుగుజాడల్లో నడిచి శ్రీరామ్మూర్తి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. భీమవరంలో సిపిఎం జిల్లా కార్యాలయంలో ఉమ్మడిజిల్లా సీనియర్ నాయకులు శ్రీరామ్మూర్తి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్‌తో కలిసి బలరాం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి 1935లో నారినమెరక గ్రామంలో జన్మించారన్నారు. విద్యార్థి దశనుంచే అభ్యుదయ భావాలతో ఉండేవారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి ఆదర్శ ఉపాధ్యాయునిగా పనిచేశారన్నారు. వేలాది మంది విద్యార్థుల్ని సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దారన్నారు. సోషలిస్టు చైతన్యంతో జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించారని కొనియాడారు. సిపిఎం జిల్లా నాయకులు గోపాలన్ మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి మాస్టారు లేని లోటు కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, మామిడిశెట్టి రామాంజనేయులు, కార్యకర్తలు మల్లిపూడి ఆంజనేయులు, ఒడుగు వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

భీమవరం : నివాళులర్పిస్తున్న నాయకులు

గణపవరం: సిపిఎం జిల్లా నాయకులు, యుటిఎఫ్ ఉద్యమనేత వలవల శ్రీరామ్మూర్తి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పెచ్చేట్టి నరశింహమూర్తి అన్నారు. ఆదివారం కేశవరంలో జరిగిన శ్రీరామ్మూర్తి సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. శ్రీరామ్మూర్తి ఉపాధ్యాయ నాయకుడుగా కాకుండా రైతుల సమస్యలపై ఎనలేని పోరాటం చేసిన వ్యక్తి అని అన్నారు. తాను చనిపోయే వరకు సిపిఎం నాయకులుగా ప్రజలకు సేవలందిచారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. శ్రీరామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతపల్లి దుర్గాప్రసా, సిహెచ్.పార్వతి, పెచ్చేట్టి లక్ష్మి వీరవల్లి గంగారత్నం, కట్టా సత్యవతి, కె.అంజిబాబు సిహెచ్.ఏడుకొండలు, జుత్తిగ శ్రీను పాల్గొన్నారు.

గణపవరంలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

తణుకు : వలవల శ్రీరామ్మూర్తి మాస్టర్ సమసమాజం కోసం తుదిశ్వాస విడిచేవరకు పనిచేశారని సిపిఎం జిల్లా నాయకులు కె.రాజా రామ్మోహన్ రాయ్ అన్నారు. ఆదివారం నెల్లూరు జిల్లాలో జరుగుతున్న సమావేశాలు నేపథ్యంలో సిపిఎం పాత పశ్చిమ గోదావరి జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా శ్రీరామ్మూర్తికి నివాళులు అర్పించారు. జోహార్ వలవల శ్రీరామ్మూర్తి, సాధిస్తాం మీ ఆశయాలను అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి మాస్టారు ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించారన్నారు. ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కాలంలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని తెలిపారు. కులం, మతం, దోపిడీలేని నూతన సమాజం కోసం ఉపాధ్యాయ ఉద్యోగం వదిలి సిపిఎంలో చేరారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, పాలకొల్లు డివిజన్ కార్యదర్శి, యుటిఎఫ్ జిల్లా నాయకుడు, రైతుసంఘం రాష్ట్ర నాయకుడుగా పని చేశారన్నారు. కుటుంబంలో ఎన్నో ఒడుదుడుకులు వచ్చినప్పటికీ గుండెధైర్యంతో పార్టీ జెండా వదలలేదని అన్నారు. ఇటీవల గత 3 నెలలుగా ఆరోగ్య సమస్యలు రావడం వల్ల రాజమండ్రి హాస్పిటల్‌లో మరణించారని తెలిపారు. ఆయన కోరిక మేరకు మృతదేహన్ని ఆశ్రమం హాస్పిటల్‌కి అప్పగించడం జరిగిందన్నారు. మాస్టర్ జీవితం నేటితరానికి ఆదర్శం అన్నారు. వాళ్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, పివి.ప్రతాప్, బి.వాసు దేవరావు, కర్రి నాగేశ్వరావు, బి.సోమయ్య, రాజమండ్రి జిల్లా కార్యదర్శి టి.అరుణ్ కుమార్, టి.కోటేశ్వరరావు, జి.రవి కిషోర్, ఎం.సుందర బాబు, మూర్తి, పవన్ పాల్గొని నివాళులు అర్పించారు.

తణుకు : నెల్లూరు సమావేశాల్లో నివాళులర్పిస్తున్న నాయకులు

వలవల శ్రీరామ్మూర్తి మాస్టర్ సమసమాజం కోసం తుదిశ్వాస విడిచేవరకు పనిచేశారని సిపిఎం నాయకులు కామన మునిస్వామి అన్నారు. ఆదివారం స్థానిక అమరవీరుల భవనంలో పార్టీ సభ్యులు ఘనంగా శ్రీరామ్మూర్తికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ వలవల శ్రీరామ్మూర్తి మాస్టర్ జీవితం నేటి తరానికి ఆదర్శం అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, గుబ్బల గోపి, సింగలూరి సత్యనారాయణ, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

74 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో అధ్వర్యంలో ఆదివారం నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వైద్యులు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 74 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచిత కంటి ఆపరేషన్లు నిమిత్తం 9 మందిని నిడదవోలుకు పంపారు. 20 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథి విచ్చేసిన మానవతా అధ్యక్షులు పచ్చ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అబినందనీయమని పట్టణ, గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నం జగదీష్, ఎల్ఎస్‌వి.నాగేశ్వరరావు(జనతా డాక్టర్), సన్నిధి సూర్యనారాయణమూర్తి, సిహెచ్.వెంకటేశ్వరరావు, సుంకర శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు సేవలందించడంలో గత ప్రభుత్వం విఫలం

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

నక్కల కాలువకు గతవారం రోజుల్లో రూ.8 లక్షలతో తాము షట్టర్లు పెట్టగా గత 5 సంవత్సరాల్లో వైసిపి ప్రభుత్వం ఎందుకు పెట్టలేదని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. ఆయన పోడూరు మండలం గుమ్మలూరులో ఇటీవల వరదలకు ముంపుకు గురైన ప్రజలకు నిత్యావసరాలు, కాయగూరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించారు. వైసిపి ప్రభుత్వం రైతులు, ప్రజలకు సేవచేసే కన్నా లిక్కర్, మైన్స్, ఇసుక ఎలా దోచుకోవాలి, ఎలా వందల కోట్లు సంపాదించాలి అనే ఆలోచనతో ఉండేదని విమర్శించారు. గత 5 సంవత్సరాల్లో కనీసం లాకులకు గ్రీజు కూడా పెట్టకపోవడంతో గోదావరి నీళ్లు దిగువకు తన్ని అనేక గ్రామాల్లో పొలాలు మునిగిపోయాయని చెప్పారు. వద్దిపర్రు నక్కల కాలువ మునిగిపోవడానికి వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.

రైతు విధిగా ఇ-పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

సెప్టెంబర్ 17వ తేదీ లోపు ఇ-పంట ప్రక్రియను పూర్తిచేయాలని పోడూరు మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ అన్నారు. ఆదివారం పోడూరు మండలం పెనుమదం, కవిటం, మట్టపర్రు గ్రామాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి ఇ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాస్తవ సాగుదారులను గుర్తించి పంట నమోదు చేయాలని సెప్టెంబర్ 17వ తేదీ లోపుగా ఇ పంట ప్రక్రియను పూర్తిచేయాలని ఆయన సూచించారు.

కొద్దిపాటి జాగ్రత్తలతో డెంగీ దూరం

హోమియో వైద్య నిపుణులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రస్తుతం వాతావరణంలో వానా, ఎండా పరిస్థితులు వల్ల దోమ కాటుతో డెంగీ జ్వరం విస్తరిస్తోందని, కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకొని జ్వారాలను దూరంగా పెట్టాలని హోమియో వైద్య నిపుణులు తెలిపారు. దోమల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నివసించే వారు కొబ్బరి నూనెను తమ మోకాళ్ల నుంచి అరికాలి వరకు రాయాలని సూచించారు. ముఖ్యంగా డెంగీ కారకమైన దోమలు మనుషుల మోకాళ్ల ఎత్తుకు మించి ఎగరలేవని వారు అన్నారు. ఇలా కాళ్లకు రాసిన కొబ్బరి నూనె ఉదయం నుంచి రాత్రి వరకు యాంటీబయాటిక్ పొరలా పనిచేస్తుందని, దోమలు దగ్గరకు రావని అన్నారు.

డెంగీ నివారణకు సూచనలు : ఎవరైనా డెంగీతో బాధపడుతున్నట్లయితే, పచ్చి యాలకుల గింజలను నోటికి రెండువైపులా ఉంచుకోవాలని, వాటిని నమలకుండా జాగ్రత్తగా అలాగే ఖాళీ నోటిలో ఉంచడం ద్వారా రక్తకణాలు నార్మల్‌గా మారతాయని, ప్లేట్‌లెట్స్ సంఖ్య వెంటనే పెరుగుతాయని వైద్యులు వెల్లడించారు. తీవ్రమైన డెంగీ వ్యాధిని ఇలా చేయడం ద్వారా 48 గంటల్లో నిర్మూలించవచ్చని అన్నారు.

ఎవరికైనా డెంగీ లేదా సాధారణ జ్వరం కారణంగా ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉంటే, నివారణకు హోమియోపతిలో ఔషధం ఉందని పేర్కొన్నారు. యుపటోరియం పర్ఫ్యోయం 200, లిక్విడ్ డైల్యూషన్ హోమియోపతి ఔషధాన్ని ప్రతి 2-2 గంటలకు సాదా నీటిలో 3 లేదా 4 చుక్కలు వేసి 2 రోజులు మాత్రమే తాగాలని వారు సూచించారు.

నేడు రాఖీ పండుగ

ప్రజాశక్తి - మొగల్తూరు

నూతన సాంకేతిక విధానాలు ఎన్ని అందుబాటులోకి వచ్చినా నేటికీ మహిళలు సోదరులకు రాఖీ కట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో మార్కెట్లో రాఖీలకు డిమాండ్ తగ్గలేదు. ఈనెల 19న రాఖీ పండగ సందర్భంగా ఆదివారం ఏర్పాటుచేసిన రాఖీ విక్రయ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

20న అద్దేపల్లి 125వ జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈనెల 20వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యాదాత అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి 125వ జయంతి వేడుకలు కోకోనట్ మర్చెంట్స్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

హోరాహోరీగా సాగుతున్న పోటీలు

హోరాహోరీగా చెగుగుడు పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని కొప్పర్రు పెదపేటలో చెడుగుడు పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రామస్థాయి చెడుగుడు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ నెల 14 నుంచి ప్రారంభమైన పోటీలు ఆదివారంతో ముగియనున్నాయి. పోటీలకు రిపరీగా నల్లి బుల్లిరాజు వ్యవహరిస్తున్నారు. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s.Shriram Finance Ltd. Aswaraopeta Branch Rep. by its Branch Manager it is stated that Smt.Koppula Vani, W/o.Koppula Ravi, 46 Yrs, House wife, R/o.Lingagudem village; Chinthalapudi Mandal, Eluru District, is creating mortgage against her property shown below as security for the proposed trade loan. If anybody having any objection, they can send the objections to me or to my client with in 5 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SHEDULE OF THE PROPERTY

Tiled roofed house bearing H.No.5-30 (Assessment no.411) with a plinth area of 1040 Sq.feet and ACC sheet roofed Toilets with a plinth area of 50 Sq.feet along with its house site of an extent of 290.4 Sq.yards or 0.06 cents in R.S.No.137-1 present Sub-division R.S.No.137-1-A1; along with electricity service connection No.095 situated at Lingagudem village and Panchayath, Chinthalapudi Mandal, Eluru District bounded by :
East : Place of Thotakura Ravi
South : Place of Koppula Ravi
West : Place of Koppula Ravi
North : R&B Road
Kothagudem **P.Ganesh Babu**
Dt.18-08-2024 Advocate, Kothagudem

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఒ.ఎస్.నెం.361/2020

వాదులు :
1) వెలగన ధనలక్ష్మి, 2) మేడిశెట్టి వెంకట రత్నం
ప్రతివాదులు :
1) మేడిశెట్టి సుబ్బారాయుడు
2) మేడిశెట్టి రంగారావు
3) వినుకొండ వెంకట బ్రహ్మాజి
4) వినుకొండ లీలా కుమారి
5) మేడిశెట్టి నాగ వెంకట రాజు
6) తిరుమల కళ్యాణి
7) మేడిశెట్టి జగన్మోహన్
8) కోటిపల్లి శింహాచలం

వాదుల తరపున దాఖలు చేసుకున్న పేపరు ప్రకటన

పైనెంబరు దావాలో 5వ ప్రతివాదియైన మేడిశెట్టి నాగ వెంకటరాజుకి హాజరు నిమిత్తం పలుమార్లు కోర్టు ద్వారా దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనకుండా తప్పించుకొనుచున్నందున కోర్టు వారు పై నెంబరు దావాలో 5వ ప్రతివాది హాజరు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. పైనెంబరు ది. **27-08-2024**వ తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు సదరు తేదీన పైనెంబరు దావాలో పై కోర్టువారి ఎదుట ఉదయం 10 గంటల నుండి హాజరు కాగలందలకు మరియు మీయొక్క ఆక్షేపణలు తెల్పుకొనవలసినదిగా యీ పేపరు ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది. అట్లు మీరు హాజరుకాని యెడల మీ పరోక్షమందు దావా తీర్మానం కాబడగలదని యిందుమూలముగా తెలియపరచడమైనది.

వాయిదా తేది : 27-08-2024

చిత్తగించవలెను
వాదుల తరపున అడ్వకేట్
భీమవరం, **పి. నరశింహం**, బి.ఎస్సీ, బి.యల్.,
తేది.10-08-2024 అడ్వకేట్ భీమవరం-2.

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఏ.నెం.573/2020 మరియు
ఒ.ఎస్.నెం.361/2020

పిటీషనర్లు/వాదులు :
1) వెలగన ధనలక్ష్మి, 2) మేడిశెట్టి వెంకట రత్నం
రెస్పాండెంట్లు/ప్రతివాదులు :
1) మేడిశెట్టి సుబ్బారాయుడు
2) మేడిశెట్టి రంగారావు
3) వినుకొండ వెంకట బ్రహ్మాజి
4) వినుకొండ లీలా కుమారి
5) మేడిశెట్టి నాగ వెంకట రాజు
6) తిరుమల కళ్యాణి
7) మేడిశెట్టి జగన్మోహన్
8) కోటిపల్లి శింహాచలం

పిటీషనర్లు/వాదుల తరపున దాఖలు చేసుకున్న పేపరు ప్రకటన

పైనెంబరు ఐ.ఎ.573/2020లో 5వ రెస్పాండెంట్/ప్రతివాదియైన మేడిశెట్టి నాగ వెంకటరాజుకి హాజరు నిమిత్తం పలుమార్లు కోర్టు ద్వారా ఐఎ నోటీసులు పంపించినను మీరు తీసుకొనకుండా తప్పించుకొనుచున్నందున కోర్టు వారు పై నెంబరు ఐఎలో 5వ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. పైనెంబరు ఐ.ఎ. ది. **27-08-2024**వ తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు సదరు తేదీన పైనెంబరు ఐ.ఎ.లో పై కోర్టువారి ఎదుట ఉదయం 10 గంటల నుండి హాజరు కాగలందలకు మరియు మీయొక్క ఆక్షేపణలు తెల్పుకొనవలసినదిగా యీ పేపరు ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది. అట్లు మీరు హాజరుకాని యెడల మీ పరోక్షమందు ఐ.ఎ.573/2020 తీర్మానం కాబడగలదని యిందుమూలముగా తెలియపరచడమైనది.

వాయిదా తేది : 27-08-2024

చిత్తగించవలెను
పిటీషనర్/వాదుల తరపున అడ్వకేట్
భీమవరం, **పి. నరశింహం**, బి.ఎస్సీ, బి.యల్.,
తేది.10-08-2024 అడ్వకేట్ భీమవరం-2.

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో
E.P.No 81/2012 in
OS. No.281/2006

బిట్వీన్ :
మేడపాటి రామచంద్రారెడ్డి ...డిక్రీ హెూల్డర్
Vs
మేకల తాతయ్యనాయుడు ...జడ్జిమెంట్ డేట్టర్ టు
మేకల తాతయ్యనాయుడు, S/o.సూర్యనారాయణ రుస్తుంబాద్, H/o.నరసాపురం మండలం

పై నెంబరు EP గ్రంధములో జడ్జిమెంట్ డేటార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది 05-09-2024వ తేదీన ఉ.గం.10.30ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

Item No.1 : పశ్చిమ గోదావరి జిల్లా. నరసాపురం సబ్-రిజిష్టారులో చేరిన నరసాపురం మండలం, నరసాపురం మున్సిపల్ లిమిట్‌లో గల 12వ వార్డులో గల 116,173 చ.గ. స్థలము అందులోగల డోరు. నెం. 6-3-14 గల ఆర్.సి.సి. బిల్డింగ్‌లో గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తుగల భవనమునకు హద్దులు.
తూర్పు : జాయింటు మార్గము
పడమర : జే.చిట్టమ్మ మరియు ఇతరులు
దక్షిణము: ఆరేటి గోపిందరావు
ఉత్తరం : మానేం చిట్టెమ్మ గారి స్థలము.
Item No.2 : పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం సబ్-రిజిస్ట్రారులో చేరిన నరసాపురం మండలం, నరసాపురం మున్సిపల్ లిమిట్ లో గల 7వ వార్డులో గల 232 చ.గ. స్థలమునకు హద్దులు.
తూర్పు : సరిపల్లి రామకృష్ణారావు గారి స్థలము
పడమర : పట్నాల జగన్నాధం
దక్షిణము: రోడ్డు
ఉత్తరం : మేకల సీతామహాలక్ష్మి గారి స్థలం
అమీనా విలువ Item No.1 Rs.5,30,000/-
Item No.2 Rs.4,64,000/-
DHR విలువ (Item No.1 మరియు Item No.2) Rs.5.30.000/-

1వ ప్రతి లోని 116, 173 చ.గ. స్థలంలోని బిల్డింగ్ లో గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు దాని డోరు నెం 6-3-14 గృహోపకరణములు మరియు విద్యుత్ గృహోపకరణములతో సహా మరియు రెండవ ప్రతిలోని నరసాపురం 7వ వార్డులో 232 చ.గ. స్థలంతో సహా వేలం ద్వారా విక్రయించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
పాలకొల్లు **యం.వెంకట రామిరెడ్డి**
తేది. 17-8-2024 అడ్వకేటు

కనిపించడం లేదు

పైడుమళ్ల ఈశ్వరి
వయస్సు 28 నుండి 30 సం॥లు

ది. 15-4-2024వ తేదీ నుండి వీరిద్దరు కనిపించడంలేదు. ఎవరికైన కనిపించినచో ఈక్రింది అడ్రసుకు సమాచారం తెలియజేయగలరు. ఆచూకీ తెలిపిన వారికి, తగిన పారితోషకం ఇవ్వబడును.

పైడుమళ్ల మణికంఠ
వయస్సు 5 సం॥లు

వెంకటరెడ్డి, యర్రగుంటపల్లి గ్రామం, చింతలపూడి మండలం
ఏలూరు జిల్లా, సెల్: 9494903194